క్లుప్తంగా

6న గిరిజన సంక్షేమ శాఖలో జాబ్‌మేళా

ఒంగోలు సెంట్రల్: గిరిజన సంక్షేమశాఖ ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తిచేసిన వారికి ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఒంగోలులోని గిరిజన భవనంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి జగన్నాథరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ చదవడం, రాయడం నైపుణ్యం గల అర్హులైన గిరిజనులకు ఎస్‌కే సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కేఎల్ గ్రూప్స్ సికింద్రాబాద్ వారి సౌజన్యంతో నిర్వహించే జాబ్‌మేళాలో దరఖాస్తుతో పాటు ఉత్తీర్ణత సర్టిఫికెట్లు, కుల అర్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి రూ.17 వేల జీతంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, అదనపు పనికి కూడా వేతనం కల్పించడం జరుగుతుందని తెలిపారు.

పారిశుధ్య కార్మికుడికి గాయాలు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పారిశుధ్య కార్మికుడు గిరిబాబు

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో భాగంగా సున్నం బస్తాలు లాగుతూ పారిశుధ్య కార్మికుడు పడిపోవడంతో అతనిపై బస్తాలు పడి గాయపడ్డాడు. ఒంగోలు నగరపాలక సంస్థలోని ఒకటో డివిజన్‌లో పనిచేసే పారిశుధ్య కార్మికుడు శీలం గిరిబాబు శనివారం ఉదయం సున్నపు బస్తాలు లాగుతున్న సమయంలో వెనక్కి పడిపోగా తలకు గాయమైంది. సమీపంలో ఉన్న కార్మికులు ఆయనను వెంటనే జీజీహెచ్‌కి తరలించారు. సమాచారం అందుకున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొర్నిపాటి శ్రీనివాసరావు, మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.మహేష్, ఎం.బాబు, కాకుమాను వెంకటేశ్వర్లు, కొన్నుపాటి చిన్న వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్న గిరిబాబును పరామర్శించారు. ఈ సందర్భంగా కొర్నిపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ మెటీరియల్ ఇవ్వాలని, సక్రమంగా పనులు చేసేందుకు తగిన పరికరాలు, పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన కార్మికుల వైద్య చికిత్స బాధ్యతలను ప్రభుత్వం తీసుకోవాలని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

డీఏఓగా కృష్ణారావు

ఒంగోలు అర్బన్: ఒంగోలు రెవెన్యూ డివిజన్ (ఆర్‌డీఓ) కార్యాలయంలో డీఏఓ (డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి)గా అదే కార్యాలయంలో కేఆర్‌సీసీ స్పెషల్ తహశీల్దారుగా పని చేస్తున్న కేఎస్ఆర్ కృష్ణారావును నియమిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా కనిగిరి డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా ఉన్న ఎస్ ఉషారాణిని ఒంగోలు ఆర్‌డీఓ కార్యాలయంలో కేఆర్‌సీసీ స్పెషల్ తహశీల్దారుగా నియమించారు.

6న జిల్లా స్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

ఒంగోలు: జిల్లాస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక ఈనెల 6న స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొడ్డు సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు అర్హులు, ఈ ఎంపిక కమిటీ సభ్యులు జిల్లా సాఫ్ట్‌బాల్ కోచ్ టి.త్రినాథ్‌బాబు నిర్వహిస్తున్నారన్నారు. ఎంపికైన వారు ఈనెల 17 నుంచి 19 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే 10వ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. ఏబీఎం జూనియర్ కాలేజీలో పీఎల్ రాజుకి రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్: 9949346536 లేదా 9398479248ను సంప్రదించాలన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

ఒంగోలు టౌన్: నగర శివారులోని వెంగముక్కలపాలెం సమీపంలో హైవేకి దగ్గరగా ఉన్న తూములో నీటి ప్రవాహానికి గుర్తుతెలియని ఒక యువకుడి మృతదేహం కొట్టుకొచ్చింది. మృతుడికి 40 సంవత్సరాల వయసు ఉంటుంది. కళ్లు, పెదవులు బాగా ఉబ్బిపోయి ఉన్నాయి. మూడు రోజుల క్రితమే మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. వీఆర్‌ఓ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు.

అతిగా వాడితే అనర్థమే..!

- పంటల సాగులో మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం
- పంట దిగుబడికి తీవ్ర నష్టం
- పిచికారీ సమయంలో జాగ్రత్తలు అవసరం
- రైతులు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు
- వ్యవసాయశాఖ ఒంగోలు సబ్ డివిజన్‌లో 16,720 మంది రైతులు

ఒంగోలు సెంట్రల్: పంటల సాగులో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడితే అనర్థాలు తప్పవు. కానీ, ఈ విషయంపై రైతులకు సరైన అవగాహన కల్పించడంలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు విఫలం కావడంతో వ్యవసాయంతో ఎరువులు, పురుగు మందుల వినియోగం రోజురోజుకూ పెరిగిపోతోంది. వ్యవసాయశాఖ ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలోని ఒంగోలు, కొత్తపట్నం, సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు, టంగుటూరు మండలాల్లో 16,720 మంది రైతులు ఉన్నారు. వారంతా 75,241 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. అయితే, ఈ ఏడాది పూర్తి స్థాయిలో వర్షాలు లేకపోవడంతో ఖరీఫ్‌లో కేవలం 7 వేల ఎకరాల్లో మాత్రమే వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఆయా పంటల సస్యరక్షణ చర్యల నేపథ్యంలో ఇటీవల కాలంలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం ఎక్కువైంది. అవగాహన లేకుండా ఇష్టానుసారం వీటిని వినియోగిస్తే భూమి నిస్సారమవుతోంది. దిగుబడులు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉంది. అలాగే కొందరు అవగాహన రాహిత్యంతో జాగ్రత్తలు తీసుకోకుండా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. అలా చేయడం వలన వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ తగిన మోతాదులో మాత్రమే రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించడం ఉత్తమం.

లాభం కంటే నష్టం అధికం...

ప్రస్తుతం వ్యవసాయ రంగంలో రైతులు సరికొత్త పద్ధతుల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం క్రమంగా పెరుగుతోంది. విత్తనాలు చల్లడం మొదలు.. పంట కోతకు వచ్చేంత వరకు పురుగు మందుల వాడకంపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉంది. లేకుంటే పంట దిగుబడి దెబ్బతినడంతో పాటు రైతులు నష్టాల బారిన పడాల్సి వస్తుంది. మోతాదుకు మించి రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తే పంటలపై తీవ్ర ప్రభావం పడుతుంది. భూసారం తగ్గడంతో పాటు భూమి తన సహజత్వాన్ని కోల్పోతుంది. దీంతో లాభం కంటే నష్టం అధికంగా ఉంటుంది. పంటలకు నీటి తడి అందించిన తర్వాత ఉదయం వేళల్లో పంటలకు తగిన మోతాదులో మాత్రమే ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. 20 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలోనే వాటిని పంటలకు పిచికారీ చేయాలని నిపుణులు చెబుతున్నారు. ఈ విషయంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకుంటేనే ప్రమాదాల నుంచి గట్టెక్కవచ్చని అంటున్నారు. లేకుంటే తీవ్ర పరిమాణాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వైద్యులు, వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.



పంటకు మందులు పిచికారీ చేస్తున్న రైతు

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- గాలికి ఎదురుగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయరాదు.
- తెగులు మందులు, పురుగు మందులు కలిపి పిచికారీ చేయరాదు.
- పిచికారీ సమయంలో చేతులకు గ్లౌజులతో పాటు నోరు, ముక్కుకు మాస్కులు ధరించాలి.
- పురుగు మందులు పిచికారీ సమయంలో కళ్లు, ముక్కు, నోరును చేతులతో రుద్దుకోరాదు. వాడిన పురుగు మందుల డబ్బాలను ఎక్కడబడితే అక్కడ వేయరాదు.
- రసాయన మందులు పిచికారీ సమయంలో స్ప్రేయర్లకు లీకులు లేకుండా చూసుకోవాలి.
- పురుగు మందు డబ్బాపై సూచించిన మేరకు లేదా వ్యవసాయాధికారులు సూచించిన మేరకు మాత్రమే మిశ్రమాన్ని కలిపి పిచికారీ చేయాలి.
- పిచికారీ సమయంలో బీడీలు, సిగరెట్లు తాగరాదు.
- పిచికారీ చేసిన తర్వాత, భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- రసాయన మందులు పిచికారీ చేసే సమయంలో కడుపుమంట, దద్దుర్లు వస్తే వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి.

మోతాదుకు మించి వాడరాదు

వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది సూచనల మేరకు తగిన మోతాదులో మాత్రమే పంటలకు ఉదయం వేళల్లో పురుగు మందులు పిచికారీ చేయాలి. ఆ సమయంలో కూడా మొహానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు ధరించాలి. మొక్కల పైభాగంతో పాటు కింది భాగం తడిసేలా పిచికారీ చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చే పురుగులు నశిస్తాయి.

– బి.రమేష్‌బాబు, ఏడీఏ, ఒంగోలు

బీజామృతంతో విత్తనశుద్ధి చేయాలి



విత్తనశుద్ధి చేయిస్తున్న ఏవో మోహన్‌రెడ్డి

కొత్తపట్నం: బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకోవాలని మండల ఏవో మోహన్‌రెడ్డి రైతులకు సూచించారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో శనివారం బీజామృతంతో విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. కొత్తపట్నంలో ఎస్‌కేబీఎస్ హైతుల్ల పొలంలో 30 రకాల నవధాన్యాల విత్తనాలను 8 ఎకరాల పొలంలో వేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసి పొలంలో చల్లుకోవాలని సూచించారు. ఇందులో కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతి నూనె గింజలు, పచ్చిరొట్ట జాతులు వేయడం జరిగిందన్నారు. ఇలా పొలంలో జాతుల సమతుల్యం ప్రకారం మొక్కలు వేయడం జరిగిందన్నారు. ఇది పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా పంటలు సాగు చేయడమని చెప్పారు. మొలక వచ్చిన 45 రోజుల తర్వాత దానిని పశువుల మేతగా ఉపయోగించుకోవచ్చన్నారు. పచ్చిరొట్ట ఎరువుగా భూమిలోపల కలియదున్నుకోవడం వలన భూమి సారవంతం అవుతుందన్నారు. ఆ తర్వాత వేసే ప్రధాన పంటకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఏడాది పాటు భూమిని పంటతో కప్పి ఉంచేందుకు ఇది రైతులకు చక్కని వరంలాంటిదని చెప్పారు. జనుము, జీలుగ వేసుకుంటే కొన్ని రకాల పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కరీముల్లా, నరసింహులు, పిట్టు వెంకటేశ్వరరెడ్డి, మల్లీశ్వరి, భవాని, సురేష్, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి

- రిమ్స్ మెడికల్ కాలేజీ ఎస్‌పీఎంఓ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి



నందిపాడులో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

మద్దిపాడు: ముర్రుపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని, బిడ్డపుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టించాలని ఒంగోలు రిమ్స్ మెడికల్ కాలేజీ ఎస్‌పీఎంఓ ప్రొఫెసర్ డాక్టర్ డి.శ్రీదేవి సూచించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని నందిపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు ఆరు నెలల పాటు ఇవ్వాలని, అనంతరం అదనపు ఆహారం ఇస్తూనే తల్లి పాలు కూడా ఇవ్వాలని సూచించారు. తల్లి పాలు ఇవ్వడం వలన రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్ శ్రావణ్, రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్లు కే భాస్కర్, ఎం.ప్రదీప్‌కుమార్, జి.యశ్వంత్, లెక్చరర్లు ఎంబీ రవిశంకర్, వెంకటేశ్వర్లు, మెడికల్ కళాశాల పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులు, పీహెచ్‌సీ డాక్టర్లు ఆనందమోహన్, జగదీష్‌బాబు, వినీల చౌదరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు లలితమ్మ, రజిత కుమారి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, నాగరాజి, సీతమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్యశాఖ సిబ్బంది, గ్రామ కార్యదర్శి శివదుర్గ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కరవది పీహెచ్‌సీలో...

ఒంగోలు రూరల్: బిడ్డకు తల్లి పాలు ఎంతో అమూల్యమైనవని కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి తెలిపారు. మండలంలోని కరవది పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, తల్లులతో కలిసి శనివారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కొంత మంది తల్లులు వారి శరీర సౌష్టవం కోల్పోతామనే కారణంతో వారి బిడ్డలకు పాలు ఇవ్వకుండా డబ్బా పాలు ఇచ్చినందున బిడ్డలు తరచూ అనారోగ్యం పాలవుతారని తెలిపారు. తల్లి తన బిడ్డకు పాలివ్వడం ద్వారా వారిద్దరి మధ్యలో పటిష్టమైన బంధం ఏర్పడుతుందని అన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పీహెచ్‌సీ వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ కృష్ణారెడ్డి, హెచ్ఎస్ రమాదేవి, స్టాఫ్ శ్రీధర్, మహేష్, భార్గవ్, రామలక్ష్మి, లక్ష్మి, వెంకట సుబ్బమ్మ, కృష్ణవేణి, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈతముక్కలలో...

ఈతముక్కల (కొత్తపట్నం): ఈతముక్కల సచివాలయం–1లో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ నవ్యరెడ్డి ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తల్లులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో నవ్యరెడ్డి, ఈతముక్కల సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.రమా, ఏపీ అజిత, పీహెచ్‌ఎన్ పద్మావతి, ఏఎన్‌ఎం జి.సుజాత, టి.సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలకు కొలతలు



కొలతలు వేయిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖరరెడ్డితో సర్వే సిబ్బంది, ఇతర అధికారులు

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో వాగును ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తూ విలేకరులపై దాడికి ప్రయత్నించిన ఒక ఎన్‌ఆర్ఐ విషయం సంచలనంగా మారిన నేపథ్యంలో.. జేసీ రోనంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు జిల్లా సర్వేయర్ శ్రీనివాసరావు శనివారం మల్లవరంలోని అక్రమ కట్టడాల వద్ద సర్వే నిర్వహించారు. రోవర్‌లో పాయింట్లు తీసుకున్నారు. దీనికి స్కెచ్ గీసి సోమవారం సమర్పిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మల్లవరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ దేవాలయం వద్ద చుక్కల భూమి ఉందని, దానిని అక్రమించడమే కాకుండా 180 లింకులు ఉన్న వాగును కేవలం 15 లింకులకు పరిమితం చేసి సదరు ఆక్రమణదారునికి దాఖలుపరిచారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో దొడ్డవరం పబ్లిక్ వాటర్ స్కీమ్‌కు నీరు పంపించడానికి ఏర్పాటు చేసిన ఊట బావి సమీపంలో లోతుగా మట్టి తీశారని తహసీల్దార్‌కు తెలిపారు. దీనివలన ఊట బావిలో నీరు తగ్గిపోయి దొడ్డవరం తెల్లబాడు గ్రామాలకు నీటి సరఫరాకు ఇబ్బంది కలుగుతోందని, ఆ గ్రామస్తులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఆక్రమణదారునికి స్థలాన్ని దాఖలుపరిచిన క్రమంలో సర్వే రిపోర్టు అడగ్గా, తమ వద్ద లేదని మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్లు చెబుతున్నారని తెలిపారు. అధికారికంగా ఇచ్చిన రిపోర్టు మండల తహసీల్దార్ కార్యాలయంలో మాయం కావడంపై విచారణ చేయాలని కోరారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించామని, వాగు ఎంత ఆక్రమణకు గురైంది, చుక్కల భూములు ఏమైనా ఆక్రమణకు గురయ్యాయా అనేది పరిశీలించాలని సర్వేయర్లను ఆదేశించారు. అదే క్రమంలో ఆక్రమణదారుడి వద్ద ఉన్న డాక్యుమెంట్లు గ్రామ వీఆర్‌ఓకు సమర్పించాలని సూచించారు. తన అనుభవంలో ఉన్న భూమికి సంబంధించి రికార్డులు సమర్పించాలని ఆయన తెలిపారు. వారి వెంట ఆర్ఐ అనూష, ఎంఎస్ అంజనీదేవి, వీఆర్‌ఓ దీపక్, ప్రవీణ్, ఇతర రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రంలో దళితులు, మైనార్టీలపై దాడులు అరికట్టాలి

- ఒంగోలు ఎంపీ మాగుంటకు కేవీపీఎస్ నాయకుల వినతిపత్రం

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో దళితులు, మైనార్టీలు, మహిళలపై దాడులు, దౌర్జన్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టాలని కోరుతూ కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం ఆధ్వర్యంలో శనివారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘురాం, కేవీపీఎస్ నాయకులు మాట్లాడుతూ వివిధ జిల్లాల్లో ఇటీవల జరుగుతున్న ఘటనలను చూసి దళితులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌ను సక్రమంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో దళితులు, మైనార్టీలు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా దళితులకు రక్షణ కల్పించే అట్రాసిటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయకపోవడం వలన దళితులకు రక్షణ కరువైపోయిందన్నారు. రాష్ట్రంలోని దళితుల ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలనకు రక్షణగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో దళితులకు రూ.2.5 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అటూరి రాఘువులు, వేశపోగు మోజేష్, తొట్టెంపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా, ఆరోగ్య బీమాపై జీఎస్టీ రద్దు చేయాలని...

జీవిత బీమా, ఆరోగ్యబీమాపై జీఎస్టీ రద్దు చేయాలని కోరుతూ ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డికి ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా, ఇన్‌స్రూ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎల్ఐసీ ఏవోఐ ఒంగోలు బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్‌వీ సుబ్బారెడ్డి, నాయకులు కె.బాలచంద్రం, బి.వెంకట్రావు, ఎం.సుబ్బారావు, ఆర్.శ్రీనివాసరావు, సీహెచ్ నరసింహారావు, బీవీ రమణయ్య, బీమా కార్పొరేషన్ ఉద్యోగుల యూనియన్ ఒంగోలు యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు బి.కేశవరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పగటి పూట పోలీసుల గస్తీ



చిన్న బస్టాండ్‌లో పోలీసులు

పొదిలి: పట్టణంలో పలు చోట్ల ఆకతాయిల గొడవలు.. ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ట్రాఫిక్ అంతరాయం చేస్తున్నారు. దీంతో సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్సై కోటయ్య పట్టణంలో పగటి పూట కూడా పోలీసుల గస్తీ టీమ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో టీమ్ సభ్యులు మోటారు సైకిల్‌పై అనుమానం ఉన్న ప్రాంతాలు, ఫిర్యాదు అందుతున్న ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు ఫోన్ చేయాలని ఫోన్ నంబర్లు ఇస్తున్నారు. అనుమానం ఉన్న వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు.

పొగాకు కేజీ గరిష్ట ధర రూ.360

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో శనివారం నిర్వహించిన వేలంలో కేజీ గరిష్ట ధర రూ.360 పలికింది. ఆర్ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. రీజియన్ పరిధిలోని 11 పొగాకు వేలం కేంద్రాల్లో శనివారం మొత్తం 10,886 బేళ్ల వేలానికి రాగా, వాటిలో 9,460 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,426 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలులోని రెండు కేంద్రాలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 122వ రోజు వేలం పాటకు 5,266 బేళ్లు రాగా, 4,597 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 669 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.360, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.292.32 పలికింది. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీ పల్లి, పొదిలి, తదితర కేంద్రాల్లో 116వ రోజు నిర్వహించిన వేలం పాటకు 5,620 బేళ్లు రాగా, 4,863 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 757 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.298.86 పలికింది.

కుక్కల దాడిలో దూడ మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన లేగ దూడ

మార్కాపురం: పట్టణంలో కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు కావడంతోపాటు మూగజీవాలు చనిపోతున్నా మున్సిపల్ అధికారుల్లో మాత్రం చలనం ఉండటం లేదు. కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు కుక్కలు, కోతుల బెడదను నివారించాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ స్పందన కరువైంది. శనివారం కొండేపల్లి రోడ్డులో కుక్కల దాడిలో లేగదూడ మృతి చెందింది. మున్సిపల్ అధికారులు శునకాల బాధలు నివారించాలని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు కోరారు. ఆవుల కోసం గోశాల నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

కుడి కాలువకు సాగు నీరందించాలి

దర్శి: కుడి కాలువకు సాగు నీరందించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం శ్రీనివాసులు కోరారు. స్థానిక ఎన్ఎస్‌పీ కార్యాలయంలో ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎడమ కాలువకు సాగుకు, తాగు నీటికి నీరు విడుదల చేశారని చెప్పారు. కుడి కాలువకు కూడా సాగు నీరు విడుదల చేసి జిల్లాను కాపాడాలని కోరారు. ప్రకాశం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయని, పశుపక్షాదులకు నీరు లేక సాగు చేసిన పంటలు కూడా ఎండిపోతున్నాయని చెప్పారు. త్వరితగతిన కాలవలకు నీరు విడుదల చేసి చెరువులను కూడా నింపాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాడపాకుల శ్రీను, పట్టణ అధ్యక్షుడు అచ్యుత గురవార్జునరావు, రూరల్ మండల అధ్యక్షుడు కాకర్లసాయి, తెలుగు రైతు నాయకులు తానికొండ ఓబయ్య పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి



ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామివారికి శనివారం ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం అభిషేకాలు, అర్చన తదితర పూజలను నిర్వహించారు. పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.